వి.కోట విద్యార్థిని ప్రతిభ



హారిక

వి.కోట: మంగళవారం జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో మండలానికి చెందిన హారిక తన ఉత్తమ ప్రతిభ ప్రయోగంతో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. చిత్తూరులో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మండలంలోని గోనుమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హారిక సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంది. బాలిక తయారు చేసి ప్రదర్శించిన 'యూటర్న్ ఇన్ సిగ్నలింగ్' అనే అంశంపై చేసిన ఉత్తమ ప్రయోగానికి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానానికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న హారికను, పాఠశాల సైన్స్ టీచర్ వెంకటరెడ్డిని సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లిలో వెంకటాచలం, లలిత దంపతులు. వీరి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి 250 గ్రాముల వెండి, రూ.50వేల నగదును చోరీ చేశారు. వీరు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా.. గమనించిన దొంగలు తాళం పగులగొట్టి బీరువాలో దాచిన సొత్తును చోరీ చేశారు. మంగళవారం చోరీ జరిగిన విషయం గుర్తించి బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి, కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

గుడుపల్లె: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గుడుపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రమేష్ కథనం మేరకు వివరాలు.. మండలంలోని జబ్బిగానిపల్లెకు చెందిన రామప్ప(62) అలియాస్ బనకప్ప. ఇతను గుడుపల్లె రైల్వేస్టేషన్ క్రాస్‌కు పనిమీద వెళ్తుండగా స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొని మృతిచెందాడు. అక్కడే విధుల్లో ఉన్న కీమెన్ రైల్వే పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కొత్త సంబరాలకు సిద్ధం

- నూతన సంవత్సరానికి స్వాగతం
- పాత సంవత్సరానికి వీడ్కోలు
- అర్ధరాత్రి నుంచే మొదలైన సంబరాలు



పలమనేరులో బేకరీల్లో ఆకర్షణీయంగా తయారు చేసిన కేక్‌లు

పలమనేరు: కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు మంగళవారం సాయంత్రం నుంచే నియోజకవర్గ ప్రజలు సిద్ధమయ్యారు. నియోజకవర్గంలోని పలు ఆలయాలు ఇప్పటికే ముస్తాబయ్యాయి. పట్టణంలోని ప్రధానమైన చర్చిలన్నీ విద్యుత్‌కాంతులతో మిరిమిట్లుగొలుపుతున్నాయి. పట్టణంలోని ఆలయాలతోపాటు మండలంలోని మొరం పంచాయతీలో వెలసిన అంజనాద్రిస్వామి ఆలయం, కూర్మాయి సమీపంలోని కూర్మ వరద రాజస్వామి ఆలయం, కాప్పల్లె వేంకటేశ్వరాలయం, గొల్లపల్లె శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరగనున్నాయి. పోలీసులు ముందస్తు హెచ్చరికలతో డిసెంబర్ 31 అర్ధరాత్రి యువత ప్రత్యేక సంబరాలపై పోలీసులు ఇప్పటికే నిషేధాజ్ఞలు విధించారు. ఎవరైనా అర్ధరాత్రి హంగామా చేస్తే కేసులు తప్పవంటూ డీఎస్పీ ప్రభాకర్ గట్టిగా హెచ్చరించారు. కొత్త సంవత్సర శుభాకాంక్షల సందేశాలు సెల్‌ఫోన్లలో ఇప్పటికే హల్‌చల్ చేస్తున్నాయి. పట్టణంలోని పలు బేకరీలు, రంగుల దుకాణాలు, ఫ్యాన్సీ స్టోర్స్, వస్త్ర దుకాణాలు జనంతో గురువారం కిటకిటలాడాయి. ఫ్లవర్ బొకేలు, ఫ్రెండ్షిప్ బ్యాండ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. న్యూఇయర్‌ను పురస్కరించుకొని రకరకాల ఆకారాల్లో 2025 కేక్‌లను స్వీట్‌స్టాళ్లలో తయారుచేశారు. ఈ కొత్త సంవత్సరంలో నియోజకవర్గవాసుల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పాత జ్ఞాపకాలను వదలి కొత్త సంవత్సరంలో కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని వీరు పిలుపునిచ్చారు. ముఖ్యంగా పాడిపంటలతో రైతులు సంతోషంగా ఉండాలని, ప్రజలందరూ సుఃఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

నేడు పెద్దిరెడ్డి రాక

పుంగనూరు: రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం మండలంలో పర్యటించనున్నారు. మంగళవారం ఈ మేరకు పెద్దిరెడ్డి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి నెక్కుందిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించనున్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ పర్యటన

పులిచెర్ల(కల్లూరు): నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి మండలంలో పర్యటిస్తారని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, కన్వీనర్ నాదమునిరెడ్డి తెలిపారు. దేవళంపేటలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో జరిగే పూజల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులందరూ పాల్గొనాలని కోరారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పుంగనూరు: అనంతపూర్‌లో సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతికి కారణమైన పోలీసుల చర్యలను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని న్యాయవాదులు విధులను బహిష్కరించారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు ఆధ్వర్యంలో న్యాయవాదులు మూడు కోర్టులను బహిష్కరించి నిరసన తెలిపారు. చెన్నకేశవులు మాట్లాడుతూ న్యాయవాది మృతికి కారణమైన పోలీసులను సస్పెండ్ చేయాలని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పెద్దిరెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో వైఎస్సార్‌సీపీ నేతలు

పలమనేరు: రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో పలమనేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, చలపతిరెడ్డి, కిశోర్, శైలేష్, రెడ్డి వీనస్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లి: రెవెన్యూ గ్రామసభలో వచ్చే అర్జీలన్నీ అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి సూచించారు. బైరెడ్డిపల్లెలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని, తప్పనిసరిగా ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు. అనంతరం చీలంపల్లెలో మినీ గోకులం షెడ్డు, మినరల్ వాటర్ ప్లాంట్, లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి బైరెడ్డిపల్లెలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రీసర్వే సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో సాగుతున్న భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు ఆర్డీఓ భవాని సూచించారు. ఆమేరకు మొరం పంచాయతీ రంగినాయనిపల్లిలో రీసర్వేపై మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తహసీల్దార్ ఇన్బునాథన్, డీఐ ఆఫ్ సర్వే, డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



విద్యాసాగర్‌ను కలిసిన నేతలు

పలమనేరు: ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆలపాటి విద్యాసాగర్ ఉద్యోగుల సమస్యల సాధన కోసం కృషిచేయాలని స్థానిక ఆ సంఘ అధ్యక్షుడు ఆనందబాబు కోరారు. ఈసందర్భంగా స్థానిక సంఘ నేతలు విజయవాడలో మంగళవారం ఆయన్ను కలిసి ఇక్కడి సమస్యలను విన్నవించినట్టు తెలిపారు. వాటిపై ప్రభుత్వంపై పోరాడి తప్పకుండా న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఆయన్ని కలిసిన వారిలో స్థానిక నేత లక్ష్మీపతి ఉన్నారు.

ఘనంగా వార్షిక రాజ్యాంగ దినోత్సవం



రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వార్షిక రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు రాజ్యాంగ నిర్మాణం, దాని పనితీరుపై ప్రదర్శన జరిపారు. ఆపై ఈ అంశాలపై ప్రతిభ చూపిన పిల్లలకు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్, టీచర్లు రవికుమార్, రవి పాల్గొన్నారు.

పచ్చదనంతో నూతనోత్సాహం



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పులిచెర్ల(కల్లూరు): నూతన సంవత్సరానికి జూనియర్ రెడ్‌క్రాస్ విద్యార్థులు మొక్కలు నాటి స్వాగతం పలికినట్లు ఆ సంస్థ సమన్వకర్త వెంకటసిద్దులు తెలిపారు. కల్లూరు జెడ్పీ హైస్కూలు ఆవరణలో మంగళవారం రంగవల్లులతో విద్యార్థులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ప్రతిఒక్కరూ పాఠశాలో మరిన్ని మొక్కలు నాటి పచ్చదనంతోపాటు, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఉపాధ్యాయులు ప్రకాష్, రాజశేఖర్, స్నేహమాలిని, చంద్రబాబు, సుభాషిణి పాల్గొన్నారు.

లింగాపురం సచివాలయం తనిఖీ



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని లింగాపురం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ బాలాజి తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది ఉదయం, సాయంత్రం ఆన్‌లైన్‌లో తప్పకుండా హాజరు నమోదుచేయాలని సూచించారు. అంగన్‌వాడీ పిల్లలకు ఆధార్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగిన రైతులు వంద శాతం ఈకేవైసీ చేసుకునేలా సచివాలయ సిబ్బంది కృషిచేయాలన్నారు. సూర్య ఘర్ ద్వారా సౌరశక్తి ఏర్పాటుకు ఆసక్తి కలిగిన ప్రజల నుంచి వివరాలు సేకరించాలని ఆయన సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.